
# ఫ్యామిలీ కోర్టు



**జె.యు.బి.వి.ప్రసాద్**

ఒక ఫామిలీ కోర్టులో విచారణ మొదలయ్యింది.

మొత్తం కోర్టంతా ఒక చిన్న రూమ్‌లో పట్టేసింది.

ఒక జడ్జీ, ఒక ముద్దాయి, ఓ ఫిర్యాదీ, నలుగురు ప్రేక్షకులూ అంతే మొత్తం కోర్టు అంతా.

కొన్ని కుర్చీలూ, కొన్ని బల్లలూ.

ముద్దాయి భార్య.

ఫిర్యాది భర్త. తలకి కట్టుతో కూర్చున్నాడు.

జడ్జీ భర్తని అడిగాడు కేసు విషయం చెప్పమని.

'నా భార్య కప్పు విసిరి నా తలకి గట్టిగా గాయం చేసింది. కొంచెం వుంటే కణత మీద తగిలి ప్రాణం పోయుండేది. ఈ మనిషితో కలిసుండడం నా వల్ల కాదు. కాబట్టి నాకు విడాకులిప్పించండి' భర్త విన్నవించుకున్నాడు.

'నీ భార్య నీ మీదకి కప్పు ఎందుకు విసిరింది? ' అడిగాడు జడ్జి సీరియస్‌గా.

'చంటి పిల్లాడు ఏడుస్తుంటే తీయమంది. తీయలేదని కప్పు మీదకి విసిరింది' తనదేం తప్పు లేనట్టే చెప్పాడు భర్త.

'యేమ్మా! నువ్వు కప్పు విసరటం వల్లనే నీ భర్త తలకి దెబ్బ తగిలిందా?' జడ్జీ భార్యని అడిగాడు.

'అసలేమయిందంటే...'భార్య చెప్పబోయింది.

జడ్జీ చేత్తో సైగ చేసి భార్యని మాట్లాడ్డం ఆపమన్నాడు.

'నేను అడిగిందానికి మాత్రమే బదులు చెప్పమ్మా ముందర. తరువాత నువ్వు చెప్పుకోవాల్సింది చెప్పుకుందువు గాని'.

భార్య తల వూపింది సరేనని.

జడ్జీ తన ప్రశ్నని మళ్ళీ అడిగాడు.

'అవునండీ. నేను కప్పు విసరడం వల్లనే అతనికి దెబ్బ తగిలింది' ఒప్పుకుంది భార్య.

ఆ నలుగురి ప్రేక్షకులకీ భర్త మీద సానుభూతి కలిగింది.

'చంటి పిల్లాడేడుస్తున్నప్పుడు నువ్వేం చేస్తున్నావయ్యా?' జడ్జీ భర్తని అడిగాడు.

'నేను లాప్‌టాప్ కంప్యూటర్ డైనింగ్ టేబుల్ మీద పెట్టుకుని పని చేసుకుంటున్నానండీ' వినయంగా చెప్పాడు భర్త.

'ఆ టైమ్‌లో నీ భార్య ఏం చేస్తోంది?' జడ్జీ మళ్ళీ అడిగాడు.

'ఆవిడ వంట గదిలో వంట చేస్తోందండీ' మరింత వినయంగా చెప్పాడు.

'మరావిడ పనిలో వున్నప్పుడు చంటిపిల్లాడిని తీసి సముదాయించవచ్చు కదా?'

'నేను కూడా కంప్యూటర్ మీద పని చేసుకుంటున్నాను కదండీ! తనే కాసేపు వంట పనాపి పిల్లాడిని చూసుకోవచ్చును కదా!' వీలైనంత వినయం చూపించాడు.

జడ్జీ తల పంకించాడు.

**ప్రవాసాంధ్ర కథ**

'యేమ్మా! నీ భర్త చెప్పింది నిజమేనా?' భార్యని అడిగాడు.

'ఏ విషయం అండీ?' ధైర్యంగానే అడిగింది భార్య.

'అతను కంప్యూటర్ పని చేసుకుంటున్నప్పుడు చంటి పిల్లాడిని చూసుకోమన్నావుట?' వివరంగా అడిగాడు.

'అవునండీ' భార్య ఒప్పుకుంది.

'నువ్వుకూడా బయట యేమన్నా వుద్యోగం చేస్తూ వుంటావా?' మళ్ళీ అడిగాడు జడ్జీ.

'లేదండీ' భార్య సమాధానం.

'మీ ఇంటికి ఎవరన్నా భోజనాలకి వస్తున్నారా అంత పెద్ద వంటలు బిజీగా చేయడానికి?'.

'లేదండీ, మా ఇద్దరి కోసమనే వంట చేస్తున్నానండీ'.

'అంటే నువ్వు మామూలు వంట చేస్తున్నప్పుడు, కంప్యూటర్‌మీద పని చేస్తున్న అతన్ని చంటి పిల్లాడిని చూసుకోమని అడిగితే అతను చూసుకోలేదని, అతని మీద కప్పు విసిరావు. అంతేనా?'

'అవునండీ' భార్య కూడా వినయంగానే చెప్పింది.

ఆ నలుగురు ప్రేక్షకులూ ఒకళ్ళ మొహాలు ఒకళ్ళు చూసుకున్నారు. విడాకులు ఖాయం అన్న అభిప్రాయం వాళ్ళమొహాల మీదే కాదు, జడ్జీ మొహం మీద కూడా కనబడింది.

భర్త మొహం మీద సంతోషం కనబడిపోతోంది తను కేసులో నెగ్గబోతున్నానని.

'జడ్జిమెంటు చెప్పెయ్య మంటారా?' జడ్జీ భార్యాభర్తలిద్దరినీ అడిగాడు.

భర్త తల వూపాడు సమాధానంగా.

'అప్పుడేనా? వివరంగా చెప్పుకోవడానికి నాకు అవకాశం ఇస్తానన్నారుగా?' అభ్యంతరం చెప్పింది భార్య.

'యేముంది ఈవిడకి చెప్పుకోవడానికి' అన్నట్లు చూసారు ప్రేక్షకులు.

'కొట్టానని తనే వొప్పుకున్నాక, అందులోనూ కారణం కూడా వొప్పుకున్నాక, ఇంకేం చెప్పుకుంటుంది' అని జడ్జీకి కూడా కొంచెం ఆశ్చర్యం వేసింది.

తల వూపాడు జడ్జీ సమాధానంగా.

భార్య చెప్పసాగింది.

'మాది ప్రేమ వివాహం కాదండీ. పెద్దలు

కుదిర్చి చేసిన పెళ్ళి మాది. పెళ్ళయిన వారం రోజులకే నన్ను అమెరికా తీసుకువచ్చాడు నా భర్త.

అంతా కొత్త వాతావరణం.

కొంతమంది స్నేహితులున్నారు గానీ మరీ మనసు విప్పి మాట్లాడుకునేంతగా స్నేహం కలగలేదు ఎవరితోనూ.

పెళ్ళైన నాలుగు నెలలకి మూడు నెలల గర్భం.

అంతా కొత్త. కొంచెం భయం. కొంచెం అయోమయం.

ఇద్దరం చిన్న వయసు వాళ్ళం. ఆర్థిక పరిస్థితుల వల్ల అప్పుడే ఎవరన్నా పెద్దవాళ్ళని సాయంగా తీసుకురాలేని పరిస్థితి. నా భర్త ఆదర్శ పురుషుడు కానప్పటికీ, ఏదో ఇద్దరం కిందా మీదా పడుతూ, దెబ్బలాడుకుంటూ, మళ్ళీ కలుస్తూ బతుకుతూనే వున్నాం.

అప్పుడే పిల్లలు పుట్టేస్తున్నారని నా భర్త బాగా గాబరా పడిపోయాడు. తనకేమీ చేతకాదనీ, తనేమీ సరిగా చూసుకోలేననీ బాధపడిపోయాడు నా భర్త.

ఒకసారి మేమిద్దరమే ఏకాంతంలో వున్నప్పుడు నా భర్త నా వళ్ళో తల పెట్టుకుని అన్నాడు.

'ఇంత తొందరగా పిల్లలు పుట్టేస్తున్నారని నాకు చాలా వర్రీగా వుంది. ఇద్దరమూ చిన్న వాళ్ళమే! పెద్దవాళ్ళ వరూ తోడు కూడా లేరు. నాకు పిల్లలని చూసుకోవడం అసలు చేతకాదు. ఎలా నెగ్గుకొస్తాను నేను?'

గొంతులో జాలి ధ్వనించింది.

కళ్ళల్లో నీళ్ళు ఒక్కటే తక్కువ అతనికి.

నాకు ఎంతో జాలీ, ప్రేమా కలిగాయి నా భర్త మీద. అతనొక చిన్న పిల్లాడిలా కనబడ్డాడు నా కళ్ళకి. అనునయంగా చెప్పాను.

'నువ్వేమీ వర్రీ కావద్దు అసలు. పిల్లనో, పిల్లాడిలో మొత్తం నేనే చూసుకుంటాను. నీకు పనేమీ చెప్పను. పిల్లలతో ఆడుకోవడం తప్ప నువ్వేమీ చెయ్యక్కరలేదు. అన్నిటికి నేనున్నాగా!!'

అతని కళ్ళల్లో నిశ్చింత కనిపించింది నాకు.

అతన్ని సముదాయించగలిగినందుకు నాకు కూడా కొంచెం సంతోషం వేసింది.

కొన్నాళ్ళకి పిల్లాడు పుట్టాడు. పిల్లాడితో ఇంటికి వచ్చినప్పటి నుంచీ, అతడికేమీ అసౌకర్యం కలగకుండా చూసుకున్నాను. పెద్ద పనీ, చిన్న పనీ అన్నీ నేనే చూసుకున్నాను. పిల్లాడితో ఆడుకోవడం, ఫొటోలు తీయడం తప్ప అతనికి పనేమీ లేకుండా చేసాను.

అలా కొన్ని నెలలు సాగాయి.

ఒక శనివారంనాడు పొద్దున్న జరిగింది ఆ సంఘటన.

చంటి పిల్లాడు వంట గది పక్కనే హాల్లో బొమ్మలతో ఆడుకుంటున్నాడు. వంటింట్లో వున్న నాకు పిల్లాడు కనబడుతూనే వున్నాడు. ఎప్పుడూ ఒక కన్ను పిల్లాడి మీద వేసి పని చూసుకుంటూ వుంటాను.

ఇంతలో అతను లేచి బాత్‌రూమ్‌కి వెళ్ళి మొహం కడుక్కుని వచ్చాడు. డైనింగ్ టేబుల్ మీద లాప్ టాప్ కంప్యూటర్ సెట్ చేసుకున్నాడు.

నేనిచ్చిన టీ తాగుతూ కంప్యూటర్ మీద దబదబా బాదడం మొదలు పెట్టాడు అతను.

'ఏమిటి చేస్తున్నావు కంప్యూటర్ మీద పొద్దున్నే? ఏమన్నా ఆఫీసు పనా?' అడిగాను నా వంట పని చేసుకుంటూ.

'అబ్బే ఆఫీసు పని కాదు. ఈ మెయిల్స్ చూసుకుంటున్నాను. కొన్నింటికి రిప్లై రాస్తున్నాను. ఎన్ని ఈ మెయిల్స్ వచ్చాయో ఈ రోజు!' సంతోషంగా కీ బోర్డు మీద బాదడం ఎక్కువ చేసాడు.

విని వూరుకున్నాను.

ఈ లోపల చంటి పిల్లాడెందుకో యేడవడం మొదలుపెట్టాడు.

నేను ఒక చేత్తో వేడి మూతని పేపరు టవల్‌తో పట్టుకుని, ఇంకో చేత్తో కూర కలుపుతున్నాను.

'ఫిర్యాది కోరుకున్న విడాకులు నిరాకరిస్తున్నాను. ఈ రోజు నుంచీ ఇంట్లో వున్నంత సేపూ ఫిర్యాది ముద్దాయితో సమానంగా పిల్లాడి పనులు చేయాలని ఆదేశిస్తున్నాను.'



కూర బాగామెత్తగా ఉడికితే అతనికి నచ్చదు. తినీ తినకుండా సణుగుతూ లేచిపోతాడు.

ప్రాణం వుసూరుమంటుంది నాకు.

'పిల్లాడేడుస్తున్నాడు. కొంచెం చూసుకో వాడిని' బతిమాలుతూ అడిగాను.

అతని దగ్గర నుంచి సమాధానం లేదు.

ఈ లోపల పేపరు టవలు కొంచెం జరిగి, మూత వేళ్ళకి తగిలి చుర్రుమంది. వెంటనే మూత పక్కన పెట్టేసి వేళ్ళు వూదుకున్నాను.

'ఇదిగో నిన్నే అడుగుతున్నాను. పిల్లాడి నెత్తుకో ఒకసారి. ఎందుకేడుస్తున్నాడో చూడు'. కాస్త గట్టిగా చెప్పాను.

ఆ మనిషి ఉలక లేదూ, పలక లేదూ. ఆ ఈ మెయిల్ ప్రపంచంలో మునిగిపోయాడు. పక్కనే యేడుస్తున్న కన్న కొడుకుగానీ, వేళ్ళు కాల్చుకుని వూదుకుంటున్న భార్యగానీ అతని దృష్టిలో పడలేదు.

వేళ్ళతో పాటు మనసు కూడా చుర్రుమంది నాకు.

'ఎన్నిసార్లు చెబుతున్నా వినిపించుకోవేమి? పిల్లాడేడుస్తున్నాడూ. కొంచెం చూడూ అని అడుగుతున్నానా? వినపడి చావదేమి?' కోపంగా గట్టిగా అరిచాను.

అతను తలెత్తి నా వైపు చూసాడు.

'వాడు పుట్టక ముందర నుంచీ చెపుతున్నాను నాకు పిల్లల సంగతి చూసుకోవడం రాదని. అప్పుడు నువ్వే అన్నీ చూసుకుంటాననీ, ఏ పనీ నాకు చెప్పననీ వాగ్దానాలుకూడా చేసావు. అంత పిల్లాడిని చూసుకోలేని దానివి పిల్లాడిని ఎందుకు కన్నావు? ఎవరడిగారు? వాడు పుట్టకపోయినా బాగుండేది'

చాలా విసుగ్గా అన్నాడు.

అంతే! నా కన్న కడుపు భగ్గున మండిపోయింది.

అంతకాలంగా చూపిస్తున్న నా సహనం చచ్చిపోయింది.

చేతికందిన కప్పు ఒకటి తీసుకుని అతని మీదకి విసిరేసాను పిచ్చి కోపంతో.

అతను చిన్నప్పుడు బంతాట బాగా ఆడేవాడట. వెంటనే తలవొంచి, నా కప్పుని తప్పించుకున్నాడు.

అతని వెనకనున్న కిటికీ అద్దాన్ని బద్దలు కొట్టి, కప్పు వెళ్ళి బయట పడింది.

** ** **

భార్య చెప్పడం ఆపింది కొంచెం ఆయాసం తీర్చుకోవడానికి.

'అతను తల వొంచి నీ కప్పు దెబ్బ తప్పించుకుంటే అతని తలకి దెబ్బెలా తగిలింది?' ఆశ్చర్యంగా అడిగాడు జడ్జి.

'అతను అలా తెలివిగా వొంగడం చూసి నాకు ఇంకా వొళ్ళు మండిపోయింది. ఇంకో కప్పు తీసి మళ్ళీ విసిరాను. ఈసారి దెబ్బ నుంచి తప్పించుకోలేక పోయాడు.'

కొంచెం సిగ్గుపడుతున్నట్లుగా అంది భార్య.

ప్రేక్షకుల మొహాల మీద భావాలు మారిపోయాయి.

వాళ్ళు కోపంగా చూడసాగారు భర్తవైపు.

వెంటనే జడ్జీ తన జడ్జిమెంటుని చెప్పేసాడు.

'ఫిర్యాది కోరుకున్న విడాకులు నిరాకరిస్తున్నాను. ఈ రోజు నుంచీ ఇంట్లో వున్నంత సేపూ ఫిర్యాది ముద్దాయితో సమానంగా పిల్లాడి పనులు చేయాలని ఆదేశిస్తున్నాను. ఫిర్యాదిని ఇంకా గట్టిగా కొట్టనందుకు ముద్దాయిని మందలిస్తున్నాను. ఈసారెప్పుడన్నా ఫిర్యాది ఈ విధంగా ప్రవర్తిస్తే, చెయ్యి చేసుకోవాల్సిన అవసరం ముద్దాయికి లేదనీ, కోర్టుకి వస్తే ఆ కప్పులు విసిరే పని జడ్జీగా నేనే చేసి పెడతాననీ ముద్దాయికి చెబుతున్నాను.

ఇకనుంచీ ఫిర్యాది పైన నెలకొకసారి రిపోర్టును కోర్టుకి సబ్మిట్ చేయాలని ముద్దాయిని ఆదేశిస్తున్నాను. ఈ కేసుని ఇంతటితో ముగిస్తున్నాను'.

భార్య మొహం, ప్రేక్షకుల మొహాలూ ఆనందంతో విప్పారాయి.

భర్త ఖిన్న వదనంతో తల వొంచుకున్నాడు.

(నిజంగా జరిగిన ఒక సంఘటనని ఆధారంగా చేసుకుని) ■